క్లుప్తంగా

కళలను కాపాడుకోవాలి



నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

హుజూరాబాద్: కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సినీ గేయ రచయిత, గాయకుడు మురళి మధు అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో కూచిపూడి నృత్యం సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా చిన్నారుల నత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తెలంగాణలోని కళలు వర్ధిల్లాలని, జానపద కళలతో పాటు కూచిపూడి నృత్యాన్ని మనం కొనసాగిస్తున్నామని, కళలు మన జీవన సంస్కృతిని ప్రతిబింబిస్తాయన్నారు. 30 రోజులపాటు 40 మంది బాలికలకు వరంగల్‌కు చెందిన ఎన్.సీఎన్ కళాక్షేత్రం డ్యాన్స్ మాస్టర్ వెంకటేశ్వర్లు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు.

విద్యుత్ సరఫరా బంద్

తిమ్మాపూర్: అల్గునూర్ ట్రాన్స్‌కో పరిధిలో విద్యుత్ లైన్ల కింద, పక్కల ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నామని, సోమవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వెంకటరమణ తెలిపారు. వాగేశ్వరి కాలేజీ నుంచి తపాలా లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వరకు రాజీవ్ రహదారికి ఇరువైపులా చెట్ల కొమ్మలు తొలగించనున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

గంగాధర: నకిలీ ఎరువులు, విత్తనాల అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి రాజు, ఎస్సై కిరణ్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆదివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా విత్తన గోదాంలు, రిజిస్టర్లు, బిల్‌బుక్‌లు పరిశీలించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వాలని సూచించారు.

గౌడ యువజన సంఘం

చొప్పదండి: చొప్పదండి పట్టణ గౌడ యువజన సంఘం నూతన అధ్యక్షుడిగా బొడిగె గంగరాజును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా పూదరి మధు నియామకమయ్యారని తెలిపారు. కార్యక్రమంలో బత్తిని ప్రశాంత్, మేడి రాకేశ్, బూరుగు శ్రీనాథ్, నరేశ్, జాగిరి సాగర్, బొడిగె శ్రీనివాస్, బుర్ర హరీశ్, ప్రవీణ్, శ్రావణ్, శ్రీకాంత్, ఉపేందర్, గంగాధర్, సాయి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టుపై పిడుగు



తిమ్మాపూర్: మండలంలో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. మన్నెంపల్లిలో తాటిచెట్టుపై పిడుగు పడటంతో చెట్టు పూర్తిగా కాలిపోయింది. దృశ్యాలను రైతులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. రైతులు జాగ్రత్తగా ఉండాలని, పిడుగుపాటు సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

మాదాపూర్‌లో అగ్నిప్రమాదం

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్ గ్రామంలో ఆదివారం ఓ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. చుట్టుపక్కల పొలాల్లోకి మంటలు వ్యాపించాయి. గ్రామానికి చెందిన సంపతి ఉదయ్ వరికట్టలు, పైపులు కాలిపోయాయి, మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పిందని, రూ.20 వేల నష్టం జరిగిందని ప్రభుత్వమే ఆదుకోవాలని ఉదయ్ కోరాడు.

ఆహ్వానం లేదని జెడ్పీటీసీ ఆగ్రహం

చిగురుమామిడి: మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు అధికారులు తనకు ఆహ్వానం పంపలేదని, ఎంపీడీవో మధుసూదన్ తనపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జెడ్పీటీసీ గీకురు రవీందర్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఎంపీడీఓ మధుసూధన్ ఒంటెద్దుపోకడలకు పోతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక పోరాటాలు చేశానని, ప్రజాప్రతినిధికి ఆహ్వానం పంపకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయంగా ఉండాలన్నారు. విషయం మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఎంపీడీఓను వివరణ కోరగా ఆఫీసు సబార్డినేట్‌తో జెడ్పీటీసీకి ఆహ్వానపత్రాలు పంపినానని, తనకు ఏలాంటి దురుద్దేశంలేదని పేర్కొన్నారు.

సంబురంగా పదేళ్ల పండుగ

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో ఆదివారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు, వివిధ పార్టీ ఆఫీసుల వద్ద నాయకులు జాతీయ జెండా ఎగురవేశారు. అమరులకు నివాళి అర్పించారు. తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించినవారి సేవలను స్మరించుకున్నారు. ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోనియా గాంధీ పేరున అర్చన చేసిన నాయకులు ఆమె చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ క్యాంపు ఆఫీస్‌లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జెండా ఎగురవేశారు. హుజూరాబాద్ బస్టాండ్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, నివాళి అర్పించారు. పట్టణానికి చెందిన ఉద్యమకారులు హైదరాబాద్‌లో ప్రభుత్వం నిర్వహించిన దశాబ్ది ఉత్సవాలకు తరలివెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడం హర్షణీయమన్నారు.



హుజూరాబాద్ పట్టణంలో అమరవీరుల స్తూపానికి నివాళి అర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు



తిమ్మాపూర్: ఎల్ఎండీలోని క్యాంపు కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



చొప్పదండి: జెండా ఆవిష్కరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ



రామడుగు: ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ హరీశ్



జమ్మికుంట: సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఇల్లందకుంటలో...



ఇల్లందకుంట: రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో బీజేపీ నాయకులు



గన్నేరువరం: కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో



చిగురుమామిడి: జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ కొత్త వినీత



గన్నేరువరంలో పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



మానకొండూర్: జెండా ఎగురవేసిన తహసీల్దార్ రాజు



మానకొండూర్: వందనం చేస్తున్న ఎంపీపీ సులోచన



రాష్ట్ర అవతరణ వేడుకలకు హాజరయ్యేందుకు హుజూరాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఉద్యమకారులు

శిథిలావస్థ.. సిబ్బంది కొరత

- ఇల్లందకుంట మండలంలో నాలుగే పశువైద్య ఉపకేంద్రాలు
- మండలానికి ఏళ్లుగా మంజూరు కానీ పశువైద్యాధికారి పోస్టు
- ఇన్‌చార్జిగా కొనసాగుతున్న జమ్మికుంట పశువైద్యాధికారి
- వైద్యం అందడంలేదని వాపోతున్న పాడి రైతులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

ఇల్లందకుంట: మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు ఇల్లందకుంట, మల్యాల, టేకుర్తి, రాచపల్లి గ్రామాల్లో మాత్రమే పశువైద్య ఉపకేంద్రాలున్నాయి. టేకుర్తి, మల్యాల సబ్‌సెంటర్లు శిథిలావస్థలో ఉండగా ఇల్లందకుంట మండలంగా ఏర్పడి ఆరేళ్లు గడిచినా మండల కేంద్రంలోని పశువైద్యశాల సబ్‌సెంటర్‌గానే కొనసాగుతోంది. ఇక్కడ జూనియర్ వెటర్నరీ అధికారి విధులు నిర్వర్తిస్తున్నాడు. పూర్తిస్థాయి డాక్టర్ లేక జమ్మికుంట పశువైద్య అధికారి ఇల్లందకుంట మండల ఇన్‌చార్జిగా పని చేస్తున్నారు. ఇప్పటివరకు పూర్తి స్థాయి వైద్యాధికారి పోస్టు మంజూరు కాకపోవడంపట్ల మండలంలోని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోని పశువులకు జబ్బు చేస్తే వైద్యం చేయించుకునేందుకు ఇబ్బందికరంగా ఉందని పశుసంవర్థక శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వైద్యసిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు.

ఖాళీగా పోస్టులు...

మల్యాల పశువైద్య ఉపకేంద్రంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టును రెండేళ్లుగా భర్తీ చేయలేదు. ఇటీవల అవుట్‌సోర్సింగ్ విధానంలో అటెండర్‌ను నియమించారు. రాచపల్లి, టేకుర్తి ఉపకేంద్రాల్లో అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మల్యాల లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టుతో పాటు ఆయా సబ్‌సెంటర్లలో ఖాళీగా ఉన్న మిగతా పోస్టులను సత్వరమే నియమించి పశువైద్యసేవలు అందుబాటులోకి తేవాలని పాడి రైతులు అధికారులను కోరుతున్నారు. మండలంలో నల్ల జాతి పశువులు 4,745, తెల్లజాతి పశువులు 3,455, మేకలు,గొర్రెలు సుమారు 30,382, పందులు260 వరకు ఉన్నాయి. నాలుగు సబ్‌సెంటర్లలో ఉన్న సిబ్బంది కొరతతో వైద్యం అందడం లేదని పశుపోషకులు, రైతులు వాపోతున్నారు.

శిథిలావస్థలో భవనాలు

మల్యాల, టేకుర్తి పశువైద్యభవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. బిల్డింగ్ నిర్మించిన నాటి నుంచి నేటి వరకు మరమ్మతు పనులకు నోచుకోలేదు. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో బిక్కు బిక్కుమంటూ వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. సిరిసేడు, బూజునూరు గ్రామాల్లో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గోపాల మిత్రులు పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు ప్రథమ చికిత్స చేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నట్టల నివారణ మందులు, వ్యాక్సినేషన్, బీమా తదితర సేవలను పశువైద్యుల సూచనల మేరకు అందిస్తున్నారు.



శిథిలావస్థలో మల్యాల పశువైద్య ఉపకేంద్ర భవనం

ప్రతిపాదనలు పంపాం



ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, శిథిలమైన భవనాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణాల కోసం ఉన్నత అధికారులకు గతంలోనే ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం ఉన్న ఉపకేంద్రాలతో అన్ని గ్రామాల్లోని పశువులకు సకాలంలో వైద్యం అందిస్తున్నాం.

– పవన్ మజుందార్, ఇన్‌చార్జి పశువైద్యాధికారి, ఇల్లందకుంట

కొత్త భవనం నిర్మించాలి



మండలంలోని శిథిలావస్థలో ఉన్న పశువైద్య ఉపకేంద్రాలను కూల్చివేయాలి. అదే స్థలంలో అత్యాధునిక సదుపాయాలతో కూడిన పశువైద్య భవనాలను నిర్మించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. అలాగే ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలి.

– గురుకుంట్ల మధుకర్, సామాజిక కార్యకర్త, మల్యాల



గన్నేరువరంలో పోచమ్మ బోనాలు

పోచమ్మ బోనాలు

గన్నేరువరం: మండలంలోని పారువెల్ల, గన్నేరువరంలో గ్రామాల్లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య గ్రామంలోని వీధుల గుండా ఆలయానికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం కార్యవర్గసభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న బద్దం అశ్విత

రూ.38.333 విరాళం

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామంలో శ్రీమానసాదేవి ఆలయానికి గ్రామానికి చెందిన బద్దం రాంరెడ్డి, పద్మ కూతురు అశ్విత ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం రూ.38.333 విరాళం అందజేశారు. ఆలయ గౌరవ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, చైర్మన్ చంద్రారెడ్డి, కోశాధికారి లక్ష్మీనారాయణ, లచ్చిరెడ్డి, అభినయ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

తిమ్మాపూర్: గోవాలో జరిగిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో కరీంనగర్ కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మే 25, 26 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో పదో తరగతి విద్యార్థిని పి.శ్రీనిధి అండర్–14 విభాగంలో కటా, కుమిటి విభాగాల్లో 2 బంగారు పతకాలతోపాటు గ్రాండ్ చాంపియన్ కప్ సాధించింది. శ్రీనిధిని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం క్యాంపు ఆఫీసులో అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



శ్రీనిధిని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

వానొచ్చింది.. వరద నిలిచింది

చొప్పదండి: పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనుల్లో నిర్లక్ష్యం కారణంగా తొలకరి వర్షానికి రోడ్డుపై నీరు నిలవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కాంట్రాక్టర్ డివైడర్ నిర్మాణం చేసి అసెంబ్లీ ఎన్నికలకు ముందే చేతులెత్తేయడంతో పనులు నిలిచిపోయాయి. ఆరు నెలలుగా దుమ్ము, గుంతలు, మట్టి కుప్పలతో ఇబ్బంది పడ్డ ప్రయాణికులు, వాహనదారులు ఇప్పుడు వర్షాకాలం ప్రారంభంతో నిల్వ నీటితో సతమతమవుతున్నారు. వర్షాకాలం సమీపించినా మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టక పోవడంతో నీటిలో నుంచే వాహనాలు వెళుతున్నాయి. అధికారులు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

చొప్పదండి: ఏడాదిగా సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేయకుండా ప్రయాణికులు, వాహనదారులను ఇబ్బంది పెడుతున్న అధికారులపై చర్యలు తీసుకోకుండా మున్సిపల్ పాలకవర్గం నిర్లక్ష్యం ప్రదర్శించడం సరికాదని ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ సింగిరెడ్డి కృష్ణారెడ్డి విమర్శించారు. గుమ్లాపూర్‌లో ఆదివారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణతో కలిసి మాట్లాడారు. సూచికలు లేకుండా ప్రమాదాల బారిన పడుతుంటే స్పందించాల్సిన చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్లు ఓ కౌన్సిలర్ ద్వారా ప్రకటనలు ఇప్పించడం శోచనీయమన్నారు. ప్రశ్నించిన వారిపై విమర్శలకు దిగడం హాస్యాస్పదమన్నారు.



అంగడి బజార్ మూలమలుపు వద్ద రోడ్డుపై నీరు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జమ్మికుంట: పట్టణంలోని సంఘమిత్ర జూనియర్ కళాశాల 2006–08 విద్యా సంవత్సరం విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత వివిధ ప్రాంతల్లో స్థిరపడిన మిత్రులు ఒక్కచోట చేరి చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చదువు రాజేందర్‌రెడ్డి, డైరెక్టర్లు మామిడి తిరుపతిరెడ్డి, ఏరెడ్డి తిరుపతిరెడ్డి, అధ్యాపకులు శ్రీనివాస్, సాంబయ్య, కృష్ణారెడ్డి, రవి, సురేశ్, రాజన్న, రామచందర్, విజయ్, రహమాన్, పూర్వ విద్యార్థులు రమణారెడ్డి, చిరవంజీవి, మహేష్, నాగరాజు, పావని, స్వప్న, అమరావతి, వేణు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి మంత్రి భరోసా

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్‌కు చెందిన క్రికెట్ క్రీడాకారుడు మట్టెల శివకుమార్ మధ్యప్రదేశ్‌లో జరిగే పోటీలకు వెళ్లేందుకు కావాల్సిన ఆర్థికసాయాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమకూరుస్తానని హామీ ఇచ్చారు. ఈమేరకు ఆదివారం నగదు మంజూరు పత్రాన్ని నాయకులు శివకుమార్‌కు అందజేశారు. ఆరు నెలలుగా హైదరాబాద్‌లోని ప్రముఖ క్రికెట్ అకాడమీ ఎస్ఎస్‌క్లబ్‌లో హెడ్ కోచ్‌గా పనిచేస్తున్న లవన్‌పటేల్ ఆధ్వర్యంలో క్రికెట్‌లో శివకుమార్ శిక్షణ తీసుకున్నాడు. శిక్షణ సమయంలో టాలెంట్‌ను గుర్తించి కోచ్ హైదరాబాద్ ఎస్ఎస్‌ఈ జట్టులో స్థానం కల్పించారు. మధ్యప్రదేశ్‌కు వెళ్లేందుకు నగదు లేక తండ్రి కాంగ్రెస్ నాయకులను సంప్రదించాడు.



శివకుమార్‌కు నగదు మంజూరు ప్రొసీడింగ్ అందిస్తున్న కాంగ్రెస్ నేతలు